క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

వైఆర్‌పీ ఫౌండేషన్ ఎలీషారా రవి ప్రసాద్



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న రవి ప్రసాద్

మహేశ్వరం: పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని వైఆర్‌పీ ఫౌండేషన్ ఎలీషారా రవి ప్రసాద్ అన్నారు. మామిడిపల్లిలో శనివారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ ప్రతిమలతో పర్యావరణానికి చేటు కలుగుతుందన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా చిరు ప్రయత్నంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ల వెంకటేశ్, ఎడ్ల వాసుదేవా రెడ్డి, రఘువీరా రెడ్డి, యశ్వంత్ రెడ్డి, లాల్‌రాజు గౌడ్, ఈరంకి రాజు గౌడ్, జగన్నాథ్ రెడ్డి, దిలీప్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి వేడుకలకు సర్వం సిద్ధం



తుక్కుగూడ: ప్రతిష్ఠాపనకు తీసుకొచ్చిన గణపతి విగ్రహం

తుక్కుగూడ: గణపతి వేడుకల నిర్వహణకు మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, మంఖాల్, సర్దార్‌నగర్, తుక్కుగూడ, తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారన్నారు. ఇందుకు గాను భారీ గణపతి విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం నిర్వాహకులు మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులు గణపతి విగ్రహాలను తీసుకొచ్చారు.

ఎస్సీ వర్గీకరణ కోసం రిలే దీక్షలు

యాచారం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేస్తూ యాచారం మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఎస్సీలను ఏబీసీడీలు వర్గీకరించపోతే వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో నాయకులు మహేశ్, మంద లింగం, అజయ్, ప్రేమేశ్, కంబాలపల్లి రవి, రాజేశ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి జరిమానా



రశీదు అందజేస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌కు చెందిన శ్రీ సౌమ్య ఆస్పత్రి యాజమాన్యం మురుగునీరును బహిరంగంగా వదిలేస్తుండడంతో మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ జరిమానా విధించారు. శనివారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జరిమానా రసీదును ఆస్పత్రి యాజమాన్యానికి అందజేశారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పాడేసిన, మురుగు నీరు బహిరంగంగా వదిలిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, పారిశుద్ధ్య నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

కానిస్టేబుళ్లకు డీసీపీ అభినందన



కానిస్టేబుల్‌కు రివార్డు అందిస్తున్న డీసీపీ

ఆమనగల్లు: సీఎం కాన్వాయ్‌ను అడ్డుకోబోయిన బీజేవైఎం నాయకులను నిలువరించిన మహిళా కానిస్టేబుల్‌లను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. ఆమనగల్లు పట్టణంలో సీఎం కేసీఆర్ కాన్వాయ్ వెళ్తున్న సమయంలో బీజేవైఎం నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అక్కడే విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు అపర్ణ, రమాదేవీలు వారిని నిలువరించి, కాన్వాయ్ సాఫీగా సాగేందుకు కృషి చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుళ్లు అపర్ణ, రమాదేవిలను డీసీపీ నారాయణరెడ్డి అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు. ఇందులో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బాలరాంలు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్

దారులన్నీ తుక్కుగూడ వైపే

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించతలపెట్టిన విజయభేరి సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా సీడబ్ల్యూసీ ముఖ్యులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు హాజరుకానున్నారు. నేడు దారులన్నీ తుక్కుగూడ వైపే వెళ్లనున్నాయి. పోలీసులు ట్రాఫిక్ సమస్యలను చక్కబెట్టుతున్నారు.. భారీ బందోబస్తులు ఏర్పాటు చేశారు.



విజయభేరి సభా వేదిక

మంచిరెడ్డికి సన్మానం



కందుకూరులో మంచిరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు.

కందుకూరు: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఆయన మధ్యలో కందుకూరులో ఆగగా స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సామ మహేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, శ్రీధర్, రాజు, పర్వతాలు, ఆనంద్, రాంచంద్రారెడ్డి, సామ ప్రకాష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆలయ నిర్మాణ పనులు



నాదర్‌గుల్‌లో హనుమాన్ ఆలయ నిర్మాణ పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో హనుమాన్ ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో శనివారం బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాలని ప్రార్థించారు. పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు నిర్మాణంలో భాగస్వాములు అయ్యారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పుల్లారెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునీత, ఇంద్రసేనా, డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, జంగయ్య, శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయండి



సన్మానిస్తున్న కృష్ణనాయక్

కందుకూరు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహిస్తున్న విజయభేరి సభకు శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్ కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గంగ్ర సత్యనారాయణను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదివారం సాయంత్రం తుక్కుగూడలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ హాజరువుతున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, బంగారు బాబు, సరికొండ మల్లేష్, యూత్ ప్రెసిడెంట్ నరసింహాచారి, సీనియర్ నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, రాణాప్రతాప్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.జగన్, పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించడం సంప్రదాయం



గ్రాండ్ పేరెంట్స్‌డే సందర్భంగా క్రీడల్లో పెద్దలు

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

మీర్‌పేట: పెద్దలను గౌరవించడం సంప్రదాయమని ప్రధానోపాధ్యాయులు బాబ్జీ పేర్కొన్నారు. మీర్‌పేట నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో మెలిగి ఆత్మీయత, ప్రేమానురాగాలను పంచాలని సూచించారు. పెద్దలను గౌరవించుకోవడం మన సంస్కృతిలో భాగమన్నారు. కుటుంబం కోసం వారు చేసిన త్యాగాలను కొనియాడారు. అనంతరం చిన్నారులు తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలను ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన క్రీడల్లో పెద్దలు సరదాగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రబాబు, ఏఓ మాధవి, ఏడీ రాజేందర్, ధరణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

కడ్తాల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పర్యటన నేపథ్యంలో అడ్డంకులు సృష్టించవచ్చనే సమాచారంతో పోలీసులు బీజేపీ నాయకులను శనివారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేసి, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు సాయిలాల్ నాయక్, దశరథ్, విజయ్‌గౌడ్, మహేశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లను, సిబ్బందిని కూడా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.



బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సుపై పూలు చల్లుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

'సీఎం కేసీఆర్'కు ఘన స్వాగతం..

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించడానికి కందుకూరు మీదుగా వెళ్తున్న సీఎం కేసీఆర్‌కు శనివారం బీఆర్‌ఎస్ స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఉదయం 10 గంటల నుంచే మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కందుకూరు చౌరస్తా శ్రీశైలం రహదారిపైకి చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కేసీఆర్ ప్రయాణిస్తున్న వాహనంపై పూలు చల్లుతూ జై కేసీఆర్ అంటు నినాదాలు చేశారు. – కందుకూరు

దీర్ఘకాలిక సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఆటోనగర్ డంపింగ్ యార్డ్ స్థలంలో అద్భుతమైన ఫ్లవర్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆటోనగర్ పారిశ్రామికవాడలో రూ.2.88 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల హామీలో భాగంగా ఆటోనగర్‌లో ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు కోర్టు కేసుల వల్ల జాప్యం జరుగుతోందని, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించానని స్పష్టం చేశారు. రోడ్డు ఎత్తుపల్లాలు సరిచూసుకుని పనులు ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న విజయశ్రీకాలనీ రోడ్డును పునర్నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మోహన్‌రెడ్డి, మార్గం రాజేష్, చీర్క నర్సిరెడ్డి, భీమిడి నర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్, జంగయ్యయాదవ్, నాయకులు ఈశ్వరమ్మ యాదవ్, జక్కిడి మల్లారెడ్డి, జగదీష్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ పారిశ్రామికవాడలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాకు సమాచారం ఇవ్వకుండానే శంకుస్థాపనా?



మన్సూరాబాద్: స్థానిక కార్పొరేటర్ అయిన తనకు ముందుగా సమాచారం ఇవ్వకుండా ఆటోనగర్ పారిశ్రామికవాడలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో శంకుస్థాపన చేయించి పారిశ్రామికవాడ అధికారులు తనను అవమానించారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన పేర్కొన్నారు. శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని ఆయన శనివారం పరిశీలించి మాట్లాడారు. ఆటోనగర్ పారిశ్రామికవాడలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, ఎస్‌టీపీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.7.30 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేద్దామని తాను అధికారులను పలు మార్లు కోరినా.. ఇవి కేంద్ర నిధులు కావునా శంకుస్థాపన చేయాల్సిన అవసరం లేదని తనతో చెప్పి.. ఇప్పుడు ఎమ్మెల్యేతో ఎలా శంకుస్థాపన చేయించారని ప్రశ్నించారు.తనకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన అధికారులు.. ఉదయం 8.30 గంటలకు శంకుస్థాపన పెట్టుకుని 8 గంటలకు సమాచారం ఇవ్వడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు. స్థానిక కార్పొరేటర్ అయిన తనను కావాలనే టీఎస్‌ఐఐసీ అధికారులు అవమానించారని నర్సింహారెడ్డి అన్నారు.

అడుగడుగునా బందోబస్తు

● సీఎం పర్యటన నేపథ్యంలో ఆంక్షలు

ఆమనగల్లు: కొల్లాపూర్‌లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించేందుకు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు రోడ్డు మార్గం ద్వారా సీఎం కేసీఆర్ వెళ్లారు. అయితే సీఎం పర్యటన నేపథ్యంలో ఆమనగల్లు మండలంలో జాతీయ రహదారిపై అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకరోజు ముందే పోలీసులు సీఎం పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ మేరకు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. ఆమనగల్లు పట్టణంలో ముందస్తుగా దుకాణాలు మూసివేయించారు. కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిల్చున్నారు. కేసీఆర్ బస్సులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. సీఎం వెంట మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

కడ్తాల్: పాలమూర్- రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలో నార్లాపూర్ లిఫ్ట్‌ను ప్రారంభించేందుకు శనివారం మధ్యాహ్నం శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా రోడ్డు మార్గంలో సీఎం కేసీఆర్ వెళ్తుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం ప్రయాణిస్తున్న మార్గంలో ఎవరూ అడ్డుపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న మార్గంలో రోడ్డు ఇరువైపులా దుకాణాలను మూసివేయించారు. కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తూ సీఎం వెళ్లారు. కేసీఆర్ వెళుతున్న సమయంలో అభిమానులు, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు జై కేసీఆర్, జై తెలంగాణ అని నినాదాలు చేశారు. కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీఎం పర్యటన సాఫీగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

న్యాయశాఖ కార్యదర్శికి శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా నియమితులైన తిరుపతికి ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శాలువ కప్పి సత్కారించారు. ఈ సందర్భంగా పట్నానికి అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి కోర్టును మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్, న్యాయవాదులు సిహెచ్ రవి, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోనే ఉంటా: జోగు రాములు



ఎమ్మెల్యేను కలిసిన జోగు రాములు

నాగోలు: బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అడుగుజాడల్లో పనిచేస్తూ టీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు తెలిపారు. శనివారం ఆయన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. అనంతరం కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వస్తున్న వార్తలను ఖండించడంతో పాటు వివరణ ఇచ్చారు. కొత్తపేట జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కి పాల్గొన్నారని, అనుకోకుండా ఆ కార్యక్రమానికి వెళ్లిన తనకు కొందరు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పడంతో తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరిగిందన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఇష్టం లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని రాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ యాసిన్, జోగు నాగేష్, ఇటికాల యాదగిరి, రాజేష్, సాయిలు, ప్రదీప్ పాల్గొన్నారు.

మండపాల వద్ద సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

ఎల్‌బీనగర్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న గణపతి మండపాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాలు కల్పించాలని బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. శనివారం స్థానికంగా హయత్‌నగర్ సర్కిల్ డీసీ రవీందర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ...గణపతి నిమజ్జన సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారుల పక్కన ఉన్న చెట్ల కొమ్మలు తొలగించటంతో పాటు, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌రెడ్డి కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ, సురేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య గర్జన సభను జయప్రదం చేయండి



సభ పోస్టర్ విడుదల చేస్తున్న కాచం సత్యనారాయణ గుప్తా తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌గర్ స్టేడియంలో అక్టోబర్ ఒకటో తేదీన నిర్వహించే వైశ్య గర్జన సభను విజయవంతం చేయాలని వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. ఆర్‌కేపురంలోని వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో అన్నపూర్ణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ మంచుకొండ సురేందర్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన' వైశ్యుల ఆత్మగౌరవం- హక్కుల సాధన' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో పేరుకే అగ్రకులు వారుగా బతుకుతున్నామని, వైశ్యుల్లో చాలామంది పరిస్థితి చాలా దీనంగా ఉందన్నారు. వైశ్యుల బతుకులు మారాలంటే కార్పొరేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గమన్నారు. అక్టోబర్ 1న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే వైశ్య గర్జన సభలో అత్యధికంగా పాల్గొని వైశ్యుల సత్తా చాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పది డిమాండ్లతో కూడిన వైశ్య గర్జన సభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి నేషనల్ అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ, రామకృష్ణ మురిశెట్టి శ్రీనివాస్, నల్లపాటి బసంత్, జగిని రమేష్ గుప్తా, తోట రంగయ్య, వైశ్య వికాస వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.